



**(క్రిందటి నెల నుంచి కొనసాగింపు)**

యుగంధర్ చెప్పిన కథః

--------------

తండ్రి యుగంధర్ రాసిన ఉత్తరం చదివి శేఖర్ చిరునవ్వు నవ్వి ఉత్తరాన్ని ప్రక్కన పెట్టాడు. ఈ లోగా భార్య కమల కాఫీ తీసుకొని వచ్చింది.

“ఏమిటండీ ఆ ఉత్తరం? అది నిన్నవస్తే టి.వి. మీద పెట్టి మీకు చెప్పడం మరిచిపోయాను. ఎవరు రాసారా ఉత్తరం ?”

“'అవును కమలా,  ఇప్పడే చదివాను. అది మా నాన్న గారు రాశారు. నువ్వూ చదువు” అంటూ ఆమెకిచ్చాడు.

“చిరంజీవి శేఖర్ ను ఆశీర్వదించి వ్రాయునది. ఇప్పుడొక ముఖ్యమైన విషయం వ్రాస్తున్నాను. నీ సహకారం లభిస్తే నా సమస్య పరిష్కారమౌతుంది.

మన ఇల్లు కట్టి దాదాపు 20 సంవత్సరాలయింది. ఒక వాటాలో మేమంటూ, మరొకటి అద్దెకిచ్చిన సంగతి నీకు తెలుసు. ఇల్లంతా బాగానే ఉంది. కాని వర్షం వచ్చినపుడు లీకవుతోంది. ఒకటి రెండుసార్లు పైపై రిపేర్లు చేయించినా ఫలితం కన్పించడంలేదు. స్పెషలిస్ట్ కి చూపిస్తే పైన

ఇంకో అంతస్థు వేయడం ఒక్కటే సరైన పరిష్కారం అని చెప్పాడు. ఎస్టిమేషన్ వేయించాను. దాదాపు పదిలక్షలవుతుంది. నా దగ్గర డబ్బేమీ లేదని కేవలం పక్కపోర్షన్ మీద వచ్చే అద్దె, నా పెన్షన్ మీదే కాలం గడుడపుతున్నామని నీకు తెలుసును. నా అన్నీ నీ అమెరికా చదువుకి చేసిన అప్పు తీర్చడానికి, చెల్లి పెళ్లికి సరిపోయింది.

నీకొక ప్లాన్ చెబుతున్నా విను. పైన వేసే అప్స్టెయిర్ కయ్యే రూ 10 లక్షలు నువ్వ నాకియ్యి. కట్టేదానిని నీ పేరుమీదే కేటాయిస్తాను. దాని మీద వచ్చే అద్దెకూడ నువ్వేతీసికో, ప్రస్తుతపు హైరెంట్స్ ప్రకారం నెలకు రు. 20 వేలరూపాయలు వస్తాయి. అప్స్టెయిర్కి పూర్తిహక్కులు నీకే చెందేటట్లు దస్తావేజులు రాయిస్తాను. ఇక క్రింద ప్రస్తుతము మేముంటున్న రెండుపోర్షన్స్లోనూ తదనంతరం ఒకటి నీకెలాగూవస్తుంది. ఈ ప్రపోజల్కి నువ్వంగీకరిస్తే మీకు కలిగే లాభమేమిటి? అని నువ్వడగవచ్చు. పైన అప్ స్టెయిర్స్వేయిస్తే లీకేజ్ ప్రోబ్లమ్ పూర్తిగా పరిష్కారమవుతుంది. మేముంటున్న పోర్షన్, ప్రక్కపోర్షన్ మీద అద్దె మా కాలంగడపడానికి సరిపోతుంది. తల్లిదండ్రులకు నీవు చేసే మేలు——అదే సమయంలో నీకు నష్టం లేకుండాను ఉంటుంది. ఇది, అవసరమయితే నీ భార్యతోనూ ఆలోచించి వెంటనే నీ నిర్ణయాన్ని నాకు ఫోన్చేసి చెప్పు, పోజిటివ్గా డెసిషన్ తీసికోవలసిందిగా నా విన్నపం ఇట్లు : నీ నాన్న యుగంధర్"

కమల ఉత్తరం చదివి ఆశ్చర్యపోయింది. ఆలోచనలో మునిగిపోయింది.

"ఏంటి కమలా, నీ మామగారి ప్లానెలాగుంది?"

"చాలా బాగుందండీ! మనం కష్టపడకుండా మనకో ఇల్లు బెంగుళూరు లాంటి పెద్ద సిటీలో వస్తుంది. అదీ కేవలం పదిలక్షలతో"

"మరి మన దగ్గర డబ్బేదీ?ః

"ఉంది కదండీ. ఎదో అపార్ట్మెంటు కొందామని ప్లాన్ చేస్తున్నారు కదా?"

"ఓసి వెర్రి కమలా? మన దగ్గరున్న ఈ పదిలక్షలకు కొంత కలిపి ఇక్కడే ఒక ఎపార్టుమెంటు కొనుక్కుందాం!"

"మరి పాపం మీ నాన్న గారి సమస్య?"

"అది ఆయన సమస్య ఎల్లాగూ లీకేజ్ పరిష్కారానికి అప్స్టెయిర్ వెయ్యాలి గనుక వేసే తీరతారు. ఆయన పట్టుదల మనకు తెలిసిందే కదా! అప్పుడు ఇంకేముంది! ఉన్న ఇంట్లో సగభాగం, కట్టేదాంట్లో సగభాగం వాళ్ల తదనంతరం మనకెలాగూ వస్తుంది, మన డబ్బు ఒకపైసా ఇవ్వక్కరలేకుండా!"

"ఇది న్యాయం కాదండి! మీ అమెరికా చదువు కోసం మీ నాన్న గారు అప్పుచేసి 10 లక్షలు ఖర్చు చేశారని మీరే చెప్పారు. ఇప్పుడు ఆయన కష్టంలో మనం పాలుపంచుకోవద్దా?"

అవసరంలేదు. పిల్లల చదువులకు, ఎంత పెద్దచదువునైనా చెప్పించడం తల్లిదండ్రుల బాధ్యత. ఆయనా అదే చేశారు. అప్పుచేసి అమెరికా చదువులకు నన్ను ఎందుకు పంపాడు, తన కొడుకు అమెరికాలో చదువు తున్నాడని గొప్పలు చెప్పకోవడానికి, ఆవంకతో పెద్దకట్నంలాగడానికి!"

"కాని ఆ కట్నం ఆయన ఒక్కపైసా తీసికోలేదుగా, అంతా ముక్కుపిండి మీరే వసూలు చేసి బ్యాంక్ లో వేశారుకదా!?"

"మన మధ్యవాదన అనవసరం. నువ్వేదో త్యాగమూర్తిలా మాట్లాడకు. ఆ రోజులు పోయాయి. ఇప్పటి తరం అంతా తమలాభం, తమ భవిష్యత్తే చూసుకోవాలి! అదే "పెర్సనల్ డెవలెప్మెంట్"

"అవునులెండి, ఏరుదాటి తెప్పతెగలెయ్యడం అంటే ఇదే!" కమల తనలోతాను అనుకుంటూ వంటింట్లోకి వెళ్లింది.

శేఖర్ తండ్రికి ఫోన్ చెయ్యడానికి ఆలస్యం చెయ్యలేదు.

రింగవుతున్న ఫోన్ చూస్తే శేఖర్ ఫోన్ అని అర్థమయింది, యుగంధర్కి.

"హలో నాన్నగారూ! నమస్కారం!"

"చెప్పరా!. నా ప్రపోజల్ నీకు నచ్చిందా?"

"నచ్చింది కాని అంతడబ్బు నా దగ్గరెక్కడుంది?"

"పోనీ ఎంతివ్వగలవోచెప్పు?"

"నా దగ్గర మీకివ్వడానికి డబ్బులేదు నాన్నగారూ? ఉన్న దానిని ఇక్కడో ఎపార్టుమెంటు తీసికోవడానికి ఎడ్వాన్సు ఇచ్చేశాను. సారీ, నాన్నగారూ!"

యుగంధర్ చాలా నిరాశపడ్డాడు.

పెద్దవాడికి రాసిన ఉత్తరం కాపీనే పేరుమార్చి చిన్న వాడికీ పోస్టుచేశాడు. వాడి దగ్గరనుండి రిపై ఫోన్ వెంటనే వచ్చింది. అన్నదమ్ములిద్దరూ పరస్పరాంగీకారానికి (ఎవరూ ఇవ్వకుండా) వచ్చేరు. వాళ్లిద్దరూ డబ్బిచ్చి నష్టపోకూడదు. ఆ తిప్పలేవో, తండ్రే పడాలి!

ఇంతవరకూ యుగంధర్ తన ఇంటి గొడవచెప్పి ఆగాడు. రవికి ఆశ్చర్యమేసింది.

"అయితే యుగంధర్ గారూ, మరిపైన కన్స్ట్రక్షన్ ఎలా చేస్తున్నారు?"

"'అది చెబుతాను కాని, మీరు ఇల్లు వెదుక్కుంటూ నా దగ్గరకు ఎందుకు వచ్చారు సార్! మీకు ఒక స్వంత ఎపార్టుమెంటు ఉన్నట్టగుర్తు. అదీగాక మీ అబ్బాయి ఒక కాఫీహౌస్ కొన్నట్లుకూడ నే విన్నాను".

"అవునండీ నాకో ఎపారుప్లిమెంటున్నది, మంచి ఏరియాలో, అలాగే మా అబ్బాయీ ఒక పెద్దయిల్లు కొన్నమాటా నిజమే!"

"మరి మీకిప్పుడు ఇంటి అవసరమేమొచ్చింది?"

"చెబుతాను వినండి" అని తన సంగతి అంతా వివరంగా చెప్పాడు.

"'అయ్యయ్యో ఎంత పొరపాటు చేశారండీ, ఇంత అనుభజ్ఞలూకూడ. ఈ కాలం కుర్రాళ్లని మనం సరిగా అంచనా వెయ్యలేక పోతున్నాంలెండి!".

"అవునవును" అని తన భార్య అనుచిత ప్రవర్తన ఇత్యాది మాత్రం పైకి చెప్పలేకపోయాడు. "ఇటువంటి భయాలేమీ యుగంధర్కి లేవు. ఉంటే అంతధైర్యంగా ఎందుకుంటాడు! తనకి పిల్లల సహాయం లేకపోయినా, ఫర్దర్లోన్కి అవకాశం లేకపోయినా అనుకున్న ప్లాన్ ప్రకారం అప్స్టెయిర్ కన్స్ట్రక్షన్లోకి ముందుకెలాపోతున్నాడు!? అదంతా ఆయనే చెబుతారులే" అని ఊరుకున్నాడు.

"మీరడిగిన ప్రశ్నకిప్పుడు సమాధానం చెబుతావినండి. మా పిల్లలిద్దరూ ఎంతకేర్లెస్గా బిహేవ్ చేశారో చూశారుగా? ఇప్పటితరం అంతా ఇంచుమించు ఇల్లాగే ఉన్నది, ఏదో అదృష్టవంతులయిన తల్లిదండ్రులకు తప్ప! ముఖ్యంగా అమెరికాకల్చర్ పిల్లలకి–ఈ బాధ్యతారాహిత్యం–బాగా వంటపట్టింది, వాళ్ల మంచి లక్షణాలు రాకపోయినా. 'ఏదో మీరడిగిన విషయంవదిలిపెట్టి ఏదేదో మాట్లాడుతున్నాను. ఇప్పడు చెబుతాను వినండి. రవిగారూ, మీరు ఆంధ్రాబ్యాంకులో AGM గా పనిచేసి రిటరయ్యారుకదా! రివర్స్ మార్ట్గేజ్ అనే మాట విన్నారా?"

"అవునండీ, నేను రిటైరవడానికి వారం రోజులముందే ఆ మాటవిన్నాను."

"రివర్స్ మార్ట్గేజ్ గురించి నేను చెబుతాను, వినండి. అది చెప్పేముందు దాని అవసరం ఎలాగొచ్చిందో చెప్పి తర్వాత వివరాల్లోకి వెళ్దాం... రవిగారూ మధ్యతరగతి వాళ్లందరికి రిటైరయ్యేక ఎదురయ్యేది ఆర్థిక సమస్య సర్వీసులో ఉన్నంతకాలం నెలనెలా జీతంవస్తుంటే ఈ సమస్యరాదు. దిటైరయ్యేక జీతంరాదు, పెన్షన్ అవసరాలకు సరిపోదు. కొంతమందికి ఆ పెన్షన్ సౌకర్యమూ ఉండదు. కాని ఖర్చులు ఒక్కొక్కసారి పెద్ద ఖర్చులు, ఆడపిల్ల పెళ్లి, అబ్బాయి ఉద్యోగం, గతంలో చేసిన అప్పులూ లాంటివి చాలామందిని వెంటాడతాయి. కాని ఈ మధ్యతరగతి వాళ్లు, అధికశాతం రిటైరయ్యే

సమయానికి ఒక ఇంటివాళ్లయి ఉంటారు. అంటే సర్వీసులో ఉండగా లోన్ తీసికుని ఇల్లుకట్టుకుని జీతంనుండి వాయిదాల్లో అప్పుతీరుస్తూ రిటైరయ్యేసమయానికి ఇంటి స్వంతదారవుతారు. కాని ఆ ఇంటిమీద భుక్తిగడవదే! పోనీ ఇల్లమ్మేద్దాం, ఆ డబ్బుతో పెద్దఖర్చులకు వాడి, మిగిలిన డబ్బులు బ్యాంకులో వేసుకుని ఏ అద్దె ఇంట్లోనో ఉంటే అక్కడకూడా కొన్ని సమస్యలు ఎదురవుతాయి. ఒకటి: స్వంత ఇంటికి అలవాటుపడ్డవాళ్లు అద్దె ఇంట్లో ఉండడం కష్టం, ఇటువంటి సందర్భాల్లోనే మధ్యతరగతి రిటైరయిన వాళ్లకు దైవమిచ్చిన వరమే "రివర్స్ మార్ట్గేజ్ లోన్స్కీమ్" దీనిపేరు.

60 సం||లు దాటిన మనలాంటి వారికి ఇంటిమీద 15 సం||లు పీరియడ్ మించకుండా లోన్ ఇస్తారు. మార్కెట్ ప్రకారం ఇంటికి విలువకట్టి, ఆ వాల్యూలోపు మనకు కావలసినంత లోన్ ఇస్తారు. ఈ లోన్ని భార్యాభర్తల తదనంతరం, విల్లు ప్రకారం వారసులు ఇంటిమీద లోన్ తీర్చేసి ఇంటిని తీసికోవచ్చు. ఒకవేళ వారసులకి ఈ లోన్ బెడద వద్దను కుంటే, లోన్ ఇచ్చిన ఇనిస్టిట్యూషనే స్వాధీనంచేసుకుంటుంది. "ఈ రివర్స్ మార్ట్గేజ్ స్కీమ్ని ఈ మధ్య బ్యాంకులు చేస్తున్నాయి. ఈ మధ్యనే మనదేశానికి వచ్చింది.

"అయితే భార్యాభర్తలు ఇల్లు ఖాళీ చేయకుండా లోన్ అన్నమాట! అదీ వాళ్ల జీవితకాలంలో తీర్చనక్కరలేదు. భేష్.. బావుంది. ఈ క్రొత్త స్కీమ్తో మీరేం చేశారో చెప్పండి"

" ఈ రివర్స్ మార్ట్గేజ్ స్కీమ్ ఇస్తున్న HFDCకి వెళ్లి ఒక అప్లికేషన్ ఇచ్చాను. వాళువచ్చి మా ఇల్లు వాల్యూచేసి, కట్టబోయే అప్స్టెయిర్కి వేల్యూకట్టి 80 లక్షలు లోన్ ఇస్తామన్నారు. నేనుమాత్రం 25 లక్షలేతీసుకున్నాను. పది పన్నెడు లక్షల్లో అప్స్టెయిర్ పూరవుతుంది. మిగిలినది నా అవసరాలకు, పీస్ఫుల్ రిటర్మెంటు లైఫ్కి వినియోగిస్తాను. మా శ్రీమతికి నగలు, ఒక కారూ, ఇంటికి కొత్త సొబగులద్దడం వగయిరా, మిగిలిన సొమ్ముని FD లలో వేసి ఆరేడు నెలలకోసారి కారులో తీర్థయాత్రలు చేసూ కొత్తప్రదేశాలు చూస్తూ కాలక్షేపం చేస్తాం"

"చాలా బాగుందండీ యుగంధర్! నేను ఇంటి అద్దె కోసం వచ్చినా నాకు ఒక గుణపాఠం నేర్పారు. ఈ పాఠం నేను మా ఇల్లు అమ్మక ముందు తెలిసికొని ఉంటే ఎంత బాగుండేది!" అంటూ తను తన ఎపార్టుమెంటు అమ్మడం ఆ డబ్బుని కొడుక్కివ్వడం వాడు తన ఇంటిలో భాగమిచ్చినట్టేఇచ్చి ఇప్పుడు ఖాళీ చేయమనడం అంతా టూకీగా చెప్పాడు రవి,

"రవి గారూ, మీరు ఇల్లు ఖాళీచెయ్యక్కరలేకుండా కోర్టులో ఫైట్ చెయ్యండి. అబద్ధాలు కోర్టులో తేలడానికి సంవత్సరాలు పడుతుంది. ఒకవేళ చివరకు మీకు న్యాయం జరగకపోతే అప్పుడు పైన కాని క్రిందఉన్న ఒక పోర్షన్ కాని మీకు తప్పకిస్తాను. ధైర్యంగా ఉండండి. విజ్ఞులు, ఉత్తములు అయిన మీకునేను ఈ భరోసా ఇస్తున్నాను. వదిన గారికి కూడ ధైర్యం చెప్పండి."

"థేంక్స్ యుగంధర్ రక్త సంబంధీకులకన్న ఆప్తమిత్రులే ఆపదలో ఆదుకుంటారని మీలాంటివారిని చూశాక నాకు అర్థమయింది.." రవి భారంగాను, కొంతధైర్యంగాను బయలుదేరాడు.

ఆతృతగా ఎదురుచూస్తున్న ఇందిరకు జరిగిందంతా చెప్పి" ఇందిరా, నువ్వు ధైర్యంగా ఉండు, మన బిడ్డలు మనకు అన్యాయం తలపెట్టినా ఆదుకునే ఆప్తమిత్రులు నాకున్నారు" అని నడుంవాల్చేడు.

# VIII

"అమ్మా! రాధికా, పిల్లాడలాగుక్కపెడుతున్నాడేం" అంటూ ఇందిరవచ్చి కుర్రవాడినెత్తుకుంది.

"ఇదేంటబ్బా! అత్తగారికింత ప్రేమ పుట్టుకొచ్చిందే, నిన్నటిదాకా తనమీద కారాలు మిరియాలు నూరినావిడకు" అంటూ ఆశ్చర్యపోయింది. తనూ అదే కృత్రిమ కోణంలో జవాబిస్తూ" లేదత్తయ్యా! నేను పనిలో ఉండగా వాడికి మెలకువచ్చి, గుక్కపెడుతున్నాడు", అంటూ కుర్రవాడిని అత్తగారి దగ్గరనుండి తీసుకుంది

"కూర్చోండత్తయ్యా! కాఫీ,టిఫిన్లయ్యాయా? "అవునమ్మా మీ మామగారికి కాఫీ ఇచ్చేవరకు నాకు ఊపిరి సలపనివ్వరు! టిఫిన్ కేం తొందరలేదు" ఇరువైపుల నుండి పలకరింపులయ్యాయి.

"'రాధికా వచ్చే నెలఫలానా తేదీని మనకుటుంబానికి కావలసిన □□□□□□□□□ □□□□{ ఆ అబ్బాయి తండ్రి మీ మామగారికి చాలా కావలిసినవారు. వాళ్ల కుటుంబానికి మన కుటుంబానికి చాలా ఏళ్లనుండీ స్నేహం.వాళ్లు నీపెళ్లికి వచ్చేరుకూడాను. ఆ పెళ్లికి మనం వెళ్లాలమ్మా అది చెవుదామనే ప్రొదున్నే వచ్చాను. నువ్వు రావాలి, బాబుతో"

"అలాగే వెళ్దాం. అంత ముఖ్యమయిన పెళ్లికాకపోతే మీరూ, మామాగారూ ఎందుకు బయలుదేరతారు!"

"అలాగే తల్లీ! ఈ రోజే మీ మామగారు రిజర్వేషన్ చేయిస్తారు"

"అన్నట్లు కాకినాడలో నాకూ తెలిసిన ఓ ఫ్రండుందండీ! ఆమెను కలుసుకోవడానికి వీలౌతుందా?"

"ఎందుకు వీలుకాదు, పెళ్లి రాత్రికి. మనం ఉదయమే అక్కడకు వెళ్తున్నాం. కావలసినంత టైముంటుంది వస్తానమ్మా!" ఇందిర వేగంగా వచ్చి రవికి ప్రయాణం సంగతి చెప్పింది.

రవి వారిద్దరితోపాటు రాధికకూ కాకినాడ టౌన్ స్టేషనుకు 8 టిక్కెట్లు రిజర్వేషన్ చేయించాడు. సాయంకాలం రవి ఇందిరతో మరోవిషయం చర్చించాడు. "ఇందిరా పెళ్లికొడుక్కి మనమెలాగూ మంచి సూటింగ్ మెటీరియల్ తీసికోవాలి. ఒక మంచి గిఫ్టు తీసికోవాలి. ఇక చాలా కాలానికి మనం మరల మా చెల్లెలు దగ్గరకు వెళ్తున్నాం. ఆమెకూ శివకూ కూడ బట్టలు తీసికొనివెళ్లే బావుంటుందను కుంటున్నాను. ఏమంటావు?"

బట్టల సెలెక్షన్లో ఇందిర హృదయపూర్వకంగా పాల్గొని రవికేస్టేజిలోనూ అడ్డుపెట్టలేదు. అదే రకంగా ఇందిర సలహామేరకు కృష్ణమోహన్కి వెండి విఘ్నేశ్వరుడి ప్రతిమ తీసికున్నాడు. డబ్బుకొంచెం ఎక్కువే అయినా రవి వెనకడుగువెయ్యలేదు. ఇంతా చేసి "ఆపరేషన్ పునరుద్ధరణలో స్టార్టింగ్ కొంచం ఘనంగా ఉండి బండినిపట్టాలెక్కిస్తే స్పీడందుకోవడానికి ఆ తర్వాత పెద్ద ప్రయాసపడనక్కరలేదు! " అనుకుంటూ గతంలోకి వెళ్ళాడు రవి. సస్పెన్షన్ తనకి ఒక పెద్ద ఝలక్ అప్పడే తానింతకాలం నిర్లక్ష్యంచేసిన బంధుమిత్రులేకాదు, దేవుడూగుర్తుకొచ్చాడు. మంచివాడే గనుక ఆ గుణపాఠం నేర్చుకోనడమేకాదు, అమలు దిశగానూ అడుగులు వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. సరిగ్గా ఈ శుభసమయంలోనే కృష్ణమోహన్ శుభలేఖ, ఉత్తరం!!

రవి, కృష్ణమోహన్ పెళ్లికి రెండురోజుల ముందే శివకు ఫోన్చేసి తన రాక వివరాలు చెప్పాడు. శివ బ్రహ్మానందపడిపోయాడు. కృష్ణమోహన్ ద్వారా తానుచేసిన మంచి ప్రయత్నానికిపుడు మంచిఫలాలు చేకూరుతున్నందుకు జ్యోతి సంతృప్తిపడింది. అయినా లోలోపల అనుమానాలు– అధీ తన వదినగారి గురించి–లేకపోలేదు. చూద్దాం ఈ శుభపరిణామం ఎలాంటి భవిష్యత్ కుటుంబ సంగమానికి దారితీస్తుందో!

ఈరోజు రాత్రికే కాకినాడ ప్రయాణం, లంచ్ అయ్యాక సామానంతా సరుకున్నారు. రవి చిన్నసైజు ప్రసంగాన్ని ప్రారంభించేడు, ఇందిరతో.

'ఇందిరా! మనం ఈ రాత్రే బయలుదేరుతున్నాం. పిల్లవాడికి కావాల్సినవన్నీ తెచ్చుకుంటున్నదోలేదో రాధికతో మాట్లాడి ఆ ఏర్పాటు చూడు. మనం కాకినాడలో దిగగానే మా తరుపు బంధువులు చాలామంది కనిపించవచ్చు. గతాన్ని మర్చిపోయి అందరితోనూ చక్కగా మాట్లాడతావని ఆశిస్తున్నా!"

"అలాగేనండీ!"

"అయినా మనం వెళ్లేది కృష్ణమోహన్ పెళ్లికి. ఆ అబ్బాయిది కాకినాడ గనుక– మీ చెల్లెలూ,వాళ్లకుటుంబం ఉండటం సహజం. కాని ఇంకా మన ఇతర బంధువులూ కనబడడానికి ఆస్కారమెక్కడ??"

"ఏమో, ఒకవేళ 'కలిస్తే అని అంటున్నాను. అప్పటి మాట మనం ముందే అనేకుంటే మంచిది కదా!"

“అల్లాగేలెండి, ఆ మాత్రం అర్థంచేసికోలేనా?"

“ఇంకోసంగతి. మన కోడల్ని మనవడ్నీ వాళ్లు ఇదివరకు చూడలేదు. అందువలన వాళ్లకందరికీ కోడల్ని మనవడ్నీ నువ్వే పరిచయం చెయ్యాలి."

"నేనుగాకపోతే, మీరు చేస్తారా ఏమిటి! నాకో అనుమానం వస్తున్నది, మీరెందుకు ఇన్ని జాగ్రత్తలు చెబుతున్నారు?"

"నేను చెప్పాల్సిన అవసరంలేదనుకో. నువ్వా చదువుకున్నదానివి, సంప్రదాయాలు తెలిసిన దానివే. అనుకోని సర్ప్రైజెస్ ఎదురైతే తట్టుకోవడానికే ముందు జాగ్రత్తలు" సంభాషణ అంతటితో ముగిసింది.

సాయంకాలం ఒక గంటముందే రైలుస్టేషనుకు చేరారు. బండి కాకినాడ స్టేషను చేరింది. రైలు దిగేసరికి కృష్ణమోహన్ రెడీగాఉండి వీళ్లని రిసీవ్ చేసుకున్నాడు. స్టేషనుకు అతడే రావాలని రవి శివతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అతడు వచ్చిన సంగతి ఇందిరకు తెలియాలి.

“హలో సార్ రండి. ఆంటీ.. మా ఊరికి స్వాగతం. మీతోపాటు అక్కగారికీ, బాబుకీ కూడ"

తెల్లబోయిచూస్తున్న రాధికతో ఇందిర" ఇతనే నమ్మా పెళ్ళికొడుకు.. మనకు బాగా తెలిసిన అబ్బాయే! బాబూ ఈమె మాకోడలు రాధిక, మనవడు" అంటూ పరిచయం చేసింది. కృష్ణమోహన్ సామానందుకున్నాడు. స్టేషను బయటకు అందరూ వచ్చారు. అందరినీ కారులో కూర్చోబెట్టి తనే డ్రైవర్సీట్లో కూర్చుని స్టార్టు చేశాడు. శివ ఇంటికి రాగానే కారు ఆగింది. గుమ్మంలోనే శివ,జ్యోతి రవి కుటుంబాన్ని సాదరంగా ఆహ్వానించేరు. హాల్లో బంధువులు చాలామంది ఉన్నారు. ఇందిరకు అర్థంకాలేదు! కృష్ణమోహన్ తమని జ్యోతి ఇంటికితీసుకుని రావడం తెలిసిన విషయమే, అర్థంచేసికోవచ్చు. ఇదేంటి ఇదేపెళ్లివారిల్లు లాగున్నదే, కోలాహలంచూస్తే! ఓహో బహుశా ఇది విడిదిల్లేమో! కాని తనమరుదులూ, తోటికోడళూ కూడ ఇక్కడే ఉన్నారు. తన మామగారు, అత్తయ్య కూడా లోపల్నుండి హాల్లోకి వచ్చారు. అందరూ తమని చుట్టుముట్టారనడం సరి అయిన మాట!

"అన్నయ్యా.. వదినా.. మిమ్మల్ని మీ కోడల్నీ బాబునీ చూడటం ఎంత బాగున్నదో. చాలా కాలమైంది మనం కలుసుకుని! ఎంతోదూరం నుండి శ్రమపడి వచ్చారు. ముందు కాఫీలు తాగి, స్నానాలు చేయండి” అనే లోపులోనే కాఫీలు వచ్చేయి.

మనవడ్ని రాధికనీ జ్యోతి లోపలికి తీసుకెళ్ళింది. ఇందిర ఆశ్చర్యానికి అంతులేదు. ఏమైనా అడుగుదామంటే ఆయన్ని అక్కడున్న మగవాళ్లందరూ మూసేశారు. తనని తోటి కోడళ్ళు అత్తగారూ ఊపిరిసలపన్విడం లేదు, యోగక్షేమాలడగడంతో!, వాళ్లకళ్లల్లో ఎంత ఆనందం! ఎంత సంతోషం! పునరాగమనంలో ఇంత ఆనందమా! చెప్పొద్దూ.. ఇదంతా చూస్తుంటే తనకూ తెలియని సంతోషం. థ్రిల్లింగ్గా ఉంది. కృష్ణమోహన్ వీళ్లందరికీ తెలుసున్నవాడా? లేక అతని తల్లిరండ్రులు వీళ్లందరికీ కావలసినవారా? తన ఈ ధర్మసందేహాలు తీర్చవలసిన శ్రీవారు చిదానందరూపులై తనవైపు చిరునవ్వులు చిందిస్తున్నారు! ఆయన దొరికితే కదా తన అనుమానాలు తీరేది! బెంగుళూరు బ్యాచ్ కి జ్యోతి ఇంటిలో ఒక గది కేటాయించారు. అక్కడే వాళ్లు స్నానాదికాలు ముగించుకొని హాల్లోకి వచ్చారు. ఈ లోపల వీళ్లకి టిఫిన్స్కి లోపలికి పిలుపువచ్చింది. అవి పూర్తయ్యేసరికి గుమ్మంలో హడావిడిగా ఉంది. కృష్ణమోహన్ని పెళ్లికొడుకుని చేసే ఏర్పాట్లు స్పష్టంగా కన్పిస్తున్నాయి. అందరూ అక్షింతలూ, చిల్లర డబ్బులూ తీసికుని సిద్ధంగా ఉన్నారు. కృష్ణమోహన్ని ముత్తైదువులు పీటమీద కూర్చోబెట్టారు ఆ ఏర్పాట్లకు తన మామగారూ, అత్తగారూ నాయకత్వం వహిస్తున్నారు. అక్షింతలు వెయ్యడానికి పిలుపువచ్చింది.

“ముందుగా కుర్రవాడి తాతగారు, అమ్మమ్మ అక్షింతలు వెయ్యండి"

అంతే తన మామాగారూ, అత్తగారూ వెళ్లి అక్షింతలు వేసి అక్కడే నీళ్లతో పెట్టిన గిన్నెలో చిల్లరడబ్బులువేసి ప్రక్కకు తప్పుకున్నారు.

“‘ఇప్పుడు పెళ్ళి కొడుకు తల్లిదండ్రుల వంతు " – జ్యోతి, శివ అక్షింతలు వేశారు, ఇందిర అనుమానాలన్నీ పటాపంచలైపోయాయి. ముందుగా తన మామగారూ, అత్తగారూ వేస్తే పొజిషన్ 50% క్లియరవ్వగా, జ్యోతీ శివల యాక్షన్తో అనుమానం పూర్తిగా తొలగి ఆశ్చర్యంతో నోరువెళ్లబెట్టింది.

"ఇప్పుడు పెద్ద మేనమామ పెద్దత్తలు రావాలి" పెద్దత్త ఆశ్చర్యంలోంచి తేరుకునేలోపులోనే రవి ఇందిరను తీసుకుని ముందుకు కదిలాడు. యాంత్రికంగా తనూ కదిలి కృష్ణమోహన్కి అక్షింతలువేసి చిల్లర డబ్బులందుకుని ఆపనీ పూర్తిచేసి తీరుబడిగా ఆశ్చర్యపోవడం మొదలుపెట్టింది. ఈలోగా తన మరదలూ, తోటికోడళ్ల పెళ్లికొడుకు అక్కా బావలు——ఇలా బంధువులందరూ ఒక్కొక్కరుగా అక్షింతల కార్యక్రమం పూర్తిచేస్తున్నారు. తర్వాత స్నానాదికాలు పూర్తిచేసుకుని పెళ్లికొడుకు హాల్లోకివచ్చి అక్కడే ఆత్మీయబంధువులందరినీ కలిశాడు. ఈలోగా రవి తాను తెచ్చిన సూటింగ్ ని కృష్ణమోహన్కి, తన చెల్లికి బామ్మరిదికి తెచ్చిన బట్టలు వాళ్లకి అందించాడు. చెల్లికి ఇందిర, బావమరిదికి తనూ ఇచ్చివాళ్లకీ అక్షింతలు వేశారు. వాళ్లు అన్నకూ, వదినకూ నమస్కరించి ప్రేమాలింగనాలతో, అభిమానంతో, కృతజ్ఞతలతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ దృశ్యాలన్నీ రవి తల్లిదండ్రులూ, తమ్ముళూ వాళ్ల కుటుంబ సభ్యులు చాలా కాలం తర్వాత కలుసుకున్న ఆనందంలో తలమునకలయ్యారు. సంభ్రమాశ్చర్యాలలో మునిగినా ఇందిరా వారిసంతోషంలో హృదయపూర్వకంగా పాలుపంచుకున్నది.

కృష్ణమోహన్ ఇందిర ప్రక్కకుచేరాడు. “స్టేషన్లో మిమ్మల్ని ఆంటీ అనిపిలిచాను, కాని ఇకముందు మిమ్మల్ని అత్తయ్యా అనేపిలుస్తాను. మీరాక ఇక్కడున్నవాళ్లందికీ ఎంత సంతోషం కలిగించిందో చూస్తున్నారు కదా! ఈ సంతోషం, ఆనందం మన కుటుంబాల మద్య చిరస్థాయిగా ఉండటానికే ఈ సంగతి నేనూ మామయ్య ఇప్పటివరకు మన బంధుత్వం గురించి చెప్పలేదు. నన్ను క్షమించండి", అంటూ ఇందిర చేతులుపట్టుకున్నాడు.

"అదేంటిబాబూ, క్షమించడానికి నువ్వేం పొరపాటు చేశావ్? ఆ మాటకొస్తే నువ్వు మాకు చేసినమేలు నేనెప్పటికీ మరచిపోను” సహజ ప్రేమాభిమానాలతో ఆమె కళ్లు చెమర్చాయి. అందరికన్న ఎక్కువ సంతోషపడ్డవాడు రవి!

ఇందిర తన గతాన్నంతా మరచిపోయి ఇలా తన కుటుంబసభ్యులతో మమేకమైపోవడంతో తనకు వెయ్యేనుగులబలం వచ్చినట్లైంది. ఇక రవి తల్లిదండ్రుల మాట చెప్పనే అక్కరలేదు. ఇదంతా రాధికా గమనిస్తున్నది, నిశ్శబ్దంగా..! గతంలో తన అత్తగారి లీలలన్నీ భర్తద్వారా విని కోపం, కసి పెంచుకున్నది. అటువంటిది ఈ దృశ్యాలన్నీ చూశాక తన మామగారి చాకచక్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయింది. ఈలోగా జ్యోతివచ్చి ఇందిరనీ, రాధికనీ బాబునీ లోపలకి తీసుకుని పోయింది. వాళ్లతోపాటు రవి తల్లి లోపలకు వెళ్లిపోయింది. మరల హాల్లోకి టీలు వచ్చాయి. రవి తండ్రి, రవి తమ్ముళూ రవిదగ్గరకు చేరారు.

“ ఏరా అబ్బాయ్! రిటైరయ్యావుగా, జీవితం ఎలాగుంది? ప్రస్తుతం నీ ఏక్టివిటీ ఏమిటి?"

'మామూలే నాన్న గారూ! సర్వీసులో ఉన్నప్పుడు సెలవురోజులు ఎలా గడుపుతూ వచ్చానో, అదే పద్ధతి, ఇప్పుడూను.”

“రవీ! ఉద్యోగంలో ఉన్నంతవరకూ నిజాయితీగా రాత్రింబవళ్లు పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నావు. ఏ గొడవలు లేకుండా హాయిగా రిటైరయ్యావు..!” ఆగారు మూర్తిగారు.

"ఇదంతా మీ ఆశీర్వచనబలం, అమ్మా మీ పెంపకంలోని క్రమశిక్షణా నిజాయితీకిచ్చిన విలువా.. కారణాలు”

"థేంక్యూ. కాని రిటైరయ్యాకే మరో అసలు జీవితం ప్రారంభమవుతుంది. ఇందాకన్నావుచూడు మా ఆశీర్వాదబలం అని. అది నీ రిటర్మెంటుతో ఆగిపోకూడదు. మా నలుగురి సంతానంలో తాతగారి అనుభవాలు, పురాణ ప్రవచనాలు వినే భాగ్యంకలిగింది నీ ఒక్కడికే. అవి గుర్తున్నాయా, అదే మా నాన్నగాతో గడిపినక్షణాలు?

"ఎందుకులేవు. నిజంచెప్పాలంటే – రామాయణ, భారత, భాగవతాల్లోని సారాంశం ఆయన దగ్గరవిన్నదే. నా జీవితంలో నాకు లభించిన అదృష్టం. చిన్నవాడిననే చిన్నచూపలేకుండా, ఆ సపోటా చెట్టుక్రింద నన్ను తన ఒడిలో కూర్చోబెట్టుకుని ఎన్నెన్ని పురాణగాథలు చెప్పారో, ఎన్నెన్ని మధురాతి మధురమైన పద్యాలు చదివి వినిపించారో! వినిపించడమేకాదు, వాటి అర్థతాత్పర్యాన్ని నాకు అర్థమయ్యేరీతిలో చెప్పిన క్షణాలు నేనెన్నిటికీ మరచిపోలేను",

“ఆ తర్వాత ఆ పురాణాలు ఎప్పడైనా చదివావా? లేక అటువంటి మంచి పుస్తకాలు చదివావా?”

"నాకంత తీరికా లేదు. కోరికా లేదు. అయినా ఈ పురాణాలు, పుస్తకాలు తెలిసికోవడం, చదవడం వలన ఉపయోగం ఏముందండీ?.." నిర్లిప్తంగా ఉన్న రవికి , మంచి పుస్తకాలు చదవడం వల్ల ఉపయోగాలు, సాహిత్యానికి జీవితంలో ఉండాల్సిన స్థానం .. ఇలాంటి వన్నీ బోధ చేయసాగారు మూర్తిగారు. చుట్టుపక్కల ఉన్న వాళ్ళంతా శ్రద్ధగా వినసాగారు.

జ్యోతి లోపలనుంచీ వచ్చి అందర్నీ ఈ లోకంలోకి తీసుకుని వచ్చింది.

పెళ్లి ఘనంగా జరిగింది. నూతన దంపతులతో పాటు రవీ, ఇందిరాలే మరో ఎట్రాక్షన్ అయ్యారు. పెళ్లికొడుకు పెద్ద మామ ఇప్పటి వరకూ పెళ్లి సంప్రదింపుల్లో కన్పించనివాడు – కొన్ని దశాబ్దాలుగా ఏ ఫంక్షన్ కీ రాని పెద్దన్నయ్య-మరీ ముఖ్యంగా పెద్దవదిన. తమ పిల్లలకు పెదనాన్న పెద్దమ్మ. ఇదీ మిగతా ఇరు సోదరుల దంపతుల సంతోషం. అలాగే ఇందిరకూ, ఈ అన్న దమ్ముల, వాళ్ల పిల్లల సందడి, ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని మాట్లాడుకోవడమూ.. అన్నీ బాగున్నాయి. వంశీ కూడ ఉంటే ఎంతబావుండునో అన్న ఇందిర మాటకు రవి మరింత ఆనందించాడు. ముందే రిజర్వేషన్ అయిపోవడంవలన రవి కుటుంబానికి ఆ మరునాడే బెంగుళూరు ప్రయాణం తప్పలేదు–జ్యోతి, వాళ్ల తమ్ముళ్లు మరోరోజు ఎంతగా ఉండమన్నా రవికీ, ఇందిరకూ కూడ మరో రోజుంటే బాగుండునని ఉన్నప్పటికీ.

అందరి దగ్గర ఆత్మీయవీడ్కోలు–పరస్పరం–తీసుకుంటుండంగా బెంగుళూరు ఎక్స్ప్రెస్ కదిలింది. స్టేషన్కు జ్యోతి, శివ, కృష్ణమోహన్, రవి తమ్ముళూ వాళ్ల కుటుంబాలు, సావిత్రీ మొదలయిన పెద్ద పటాలమే వచ్చి భారమైన హృదయాలతో ఇటూ అటూ–స్టేషన్ప్లాట్ ఫారమ్ నుండి కదిలారు.

రైల్లో ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. అందువలన సంభాషణ ఎక్కువగా సాగలేదు. రాత్రి భోజనాలకి, రైల్లో వాళ్లకి జ్యోతి తగిన ఏర్పాటుచేసింది. అవికానిచ్చి త్వరగానిద్రపోయారు. రైలు బెంగుళూరు చేరింది. టాక్సీ మాట్లాడుకొని ఇల్లు చేరుకున్నారు. పగలంతా విశ్రాంతి తీసుకున్నారు. రాత్రి రాధిక ఫోను మోగింది వంశీ నుండి.

'హల్లో రాధికా ప్రయాణం, పెళ్లిహడావుడి అలసట తగ్గిందా? బాబు ఇబ్బంది పెట్టలేదు కదా?

"పెళ్ళి జరిగిందండీ. మీ అమ్మగారూ ఫుల్ కోపరేషన్ చేశారు. మీదీ, మీ నాన్నగారి ప్రణాళికా 100% సవ్యంగా అమలుజరిగింది. వాళ్లందరూ ముఖ్యంగా మీ చిన్నాన్నలు, వాళ్ల కుటుంబాలు మీనాన్నగారినీ, అమ్మగారినీ ఒక్క నిముషం వదిలిపెట్టలేదు. ఇక మీ తాతగారూ, నానమ్మల సంగతి సరేసరి! వీళ్లందరి మూలంగా అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా, చూడముచ్చటగా ఉంది. ముందు మీరు పెళ్లికి వెళ్లమన్నప్పుడు, కొంచం సందేహించాను గాని, ఇప్పుడు నాకెంత సంతోషంగా ఉందో చెప్పలేను. వెళ్లకపోయి ఉంటే ఎన్ని గొప్పసీన్లు మిస్సయిపోయిఉండేదానో!"

"వెరీగుడ్! నీ సంతోషం నాకూ ఈ రూపంగా పంచి ఇస్తున్నందుకు చాలా థేంక్స్."

"ఇంకొకటి చెబుతాను వినండి. మీ నాన్నగారి బంధువులలో మీ నాన్న, అమ్మలు కలిసిపరస్పరం ఆనందపడటం అయ్యాక మీ అమ్మగారూ మీ నాన్నగారితో ఈ సమయంలో వంశీ కూడా ఉంటే ఎంతబావుండును, అన్నప్పుడు మీ నాన్నగారి కంటినుండి ఆనందబాష్పాలు రాలాయంటే? ఇక ఈ ట్రిప్ ఎంత మెమరబులో అర్థంచేసుకోండి"ఈ మాటలు విన్నాక వంశీకీ కన్నీళ్లు వచ్చాయి.

బెంగుళూరు వచ్చాక ఇందిర ఏమి మాట్లాడుతుందో వినాలని రవీ ఆతృతగా ఉన్నాడు. రవికి టీ ఇస్తూ, ఇందిర తానూ ఒక కప్పు తీసుకుని ప్రక్కనే కూర్చుంది. కాకినాడలో తన కుటుంబసభ్యులందరూ కలిసి ఆనందం పంచుకోడానికి కృష్ణమోహన్ పెళ్ళి, అంతకుముందు అతని రంగప్రవేశం ఎంతగానో తోడ్పడ్డాయి. ఈ రెండు సంఘటనలూ, తనకూ ఇందిరకూ ఎంతో సంతోషాన్ని, తృప్తినీ కలిగించాయి. ఈ స్ఫూర్తితో తన శేషజీవితం మరింత అర్థవంతం చేసుకోడానికి ప్రయత్నించాలి.. ★★★

(ముగింపు వచ్చేనెలలో)

Post your comments